

కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటి నీరుపోసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 15: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మొక్కలు నాటి నీరుపోశారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 17న తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజున వృక్షార్చన పేరుతో మూడు మొక్కలు నాటాలని బీఆర్ఎస్ శ్రేణులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హరితహారం పేరుతో తెలంగాణను ఆకుపచ్చగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వృక్షాలతోనే మానవ మనుగడ ఉన్నదని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. అంతరించిపోతున్న అడవులను కాపాడాల్సిన బాధ్యతను గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, నాగరాజు గౌడ్, చక్రపాణి, విఠల్, నర్సింహులు, గోవర్ధన్ తదితరులు నాయకులు ఉన్నారు.

నారాయణఖేడ్ పట్టణంలో మొక్క నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు

మొక్కలు నాటిన బీఆర్ఎస్ నాయకులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 15: మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని చేపట్టిన లక్ష వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం నారాయణఖేడ్‌లోని 4వ వార్డులో బీఆర్ఎస్ నాయకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను సాకారం చేస్తూ సుపరిపాలన అందించిందన్నారు. తెలంగాణ అభ్యున్నతి కోసం అహర్నిషలు పరితపించే మాజీ సీఎం కేసీఆర్ నిండునూరేండ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌నాయక్, ఎం.ఏ.నజీబ్, వెంకటేశం, విఠల్, లక్ష్మణ్‌రావు, అంజాగౌడ్, రాజునాయక్, రాజిరెడ్డి, అబ్బుపటేల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లు పట్టివేత

జహీరాబాద్, ఫిబ్రవరి 15:అక్రమంగా నిల్వ చేసిన 196 కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. శనివారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లిలో అక్రమంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను నిల్వ చేసిన షాపుపై దాడి చేశారు. షాపులో అక్రమంగా నిల్వ చేసిన భారత్, ఇండియన్ కంపెనీలకు చెందిన కమర్షియల్ గ్యాల్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని జహీరాబాద్ గ్యాస్ గోదాంకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వరూప, షాబోద్దీన్ పేర్కొన్నారు. దాడిలో జహీరాబాద్ సివిల్ సప్లై అధికారి బస్వరాజ్, మొగుడంపల్లి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయికిరణ్, పోలీసులు పాల్గొన్నారు.

ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన

అందోల్: రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

అందోల్, ఫిబ్రవరి 15: మండలంలోని బ్రాహ్మణపల్లిలో శనివారం రైతులకు పంటల సాగు చేసే విధానం, ఎంత విస్తీర్ణంలో ఎలాంటి పంటలు సాగుచేయాలి అనే అంశాలపై అవగాహన కల్పించినట్లు సంగుపేట ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రాహుల్‌విశ్వకర్మ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంగుపేట ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక పంటలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. రైతులకు ఎలాంటి సహాయసహకరాలు అవసరమున్నా సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్ని వివిధ నమూనాలు ఏర్పాటు చేసి ఆధునిక వ్యవసాయంపై రైతులకు క్లుప్తంగా వివరించారు. రైతులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా..

రామచంద్రాపురం, ఫిబ్రవరి 15: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ వాసులకు నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు వనిర్వహించారు. ఈ పోటీల్లో గేటెడ్ కమ్యూనిటీ వాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలకు వాలీబాల్, టెన్నీస్, త్రోబాల్ క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా టీనా అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ మాట్లాడుతూ గేటెడ్ కమ్యూనిటీ వాసులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని, క్రీడా పోటీల్లో ప్రతిఒక్కరూ సరదాగా, ఉత్సాహం గా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. క్రీడా పోటీలతో ప్రతిఒక్కరిలో స్నేహ వాతావరణం నెలకొంటుందని తెలిపారు. క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక ధృఢత్వం పెంపొందుతుందని అన్నారు.

వాలీబాల్ ఆడుతున్న మహిళా క్రీడాకారులు

రైతులు ఆర్థికంగా స్థిరపడాలి

కోహీర్, ఫిబ్రవరి15: జిల్లా సహకార బ్యాంకు అందిస్తున్న సేవలను వినియోగించుకొని రైతులందరూ ఆర్థికంగా స్థిరపడాలని కోహీర్ డీసీసీబీ మేనేజర్ శివకుమార్ కోరారు. శనివారం మండలంలోని మద్రి గ్రామంలో డీసీసీబీ అందిస్తున్న సేవలపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు కోళ్ల పరిశ్రమ, పశువులు, చేపల పెంపకం, దుకాణాలు, ఇంటి నిర్మాణం, చదువుల కోసం రుణాలు అందజేస్తామన్నారు. రుణాలతో ఉపాధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచింటారు. బ్యాంక్ అందిస్తున్న సేవలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, పీఏసీఎస్ కార్యదర్శులు శ్రీకాంత్, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

మద్రి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్ శివకుమార్

ఎర్రారంలో భారీ చోరీ

అందోల్, ఫిబ్రవరి 15: తాళం వేసి ఉన్న ఇంటిని టార్గెట్ చేసిన దొంగలు భారీగా బంగారం, వెండి, నగదుతో ఉడాయించిన ఘటన మండల పరిధిలోని ఎర్రారంలో శనివారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన రాపోల్ శేషారెడ్డి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వేరే ఊరుకు వెళ్లారు. తిరిగి శనివారం ఇంటికి వచ్చి చూడగా తాళాలు తీసి ఉండడం, బీరువా పగులగొటి ఉండడం, సమన్లు చిందర వందరగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. బీరువాలో, ఇతరత్రా చోట్ల వెతకగా 25 తులాల బంగారం,16 తులాల వెండి, రూ. 1.50 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే గ్రామానికి చేరుకున్న పోలీసులు బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులతో కలిసి చోరీ వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దుమ్మెత్తిపోస్తున్న రేడియల్ రోడ్డు

- వాహనదారులు, స్థానికుల ఇబ్బందులు
- పెద్దఎత్తున వెలువడుతున్న వాయుకాలుష్యం
- నామమాత్రంగా రోడ్డు పనులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

తెల్లాపూర్ రేడియల్ రోడ్డులో భాలిస్థాయిలో వెలువడుతున్న దుమ్మూ,ధూళి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 15: తెల్లాపూర్ నుంచి కొల్లూర్ ఓఆర్ఆర్ వరకు ఎక్స్‌టెన్షన్-30 రేడియల్ రోడ్డు వేశారు. పేరుకు మాత్రమే రేడియల్ రోడ్డు, కానీ సేఫ్టీ నిబంధనలు, స్పీడ్ లిమిట్ బోర్డులు, విద్యుత్ లైట్లు ఇలా రోడ్డుకు సంబంధించి ఎలాంటి నియమనిబంధనలను అధికారులు పాటించలేదు. రేడియల్ రోడ్డు పనులను నామమాత్రంగా చేసి చేతులు దులుపుకున్నారు. రోడ్డుపైనే దుమ్మూ, ధూళి, రాళ్లు నిలిచివాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు మధ్య లో డివైడర్ నిర్మించాల్సి ఉండగా, ఆ దిశగా అడుగులు పడడం లేదు. 100ఫీట్ల రేడియల్ రోడ్డు అయినప్పటికీ రోడ్డుకు ఇరువైపులా వాహన పార్కింగ్‌లతో సగానికి రోడ్డు కుచించుపోయింది. లారీలు, టిప్పర్లతోపాటు సాధారణ వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో పాటు రోడ్డు మెయింటెనెన్స్ లేకపోవడంతో రోజూ దుమ్మూ, ధూళితో వాహనదారులతోపాటు స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రమైన దుమ్ముతో వాయుకాల్యుషం ఏర్పడుతుంది. స్థానికులు ఆ గాలిని పీల్చుకోవడంతో శ్వాస సంబంధిత వ్యాధుల బారీన పడే ప్రమాదం ఉంది. తెల్లాపూర్‌లోని మైహోమ్ సయుక్ నుంచి కొల్లూర్ ఓఆర్ఆర్ వరకు ఇదే పరిస్థితి. రాత్రి సమయంలో ఏలియన్స్ స్పేస్ స్టేషన్ వద్ద ఉన్న టర్నింగ్‌లో నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటుంది. ఆర్అండ్‌బీ అధికారులు రేడియల్ రోడ్డుపై చొరవ తీసుకోవడం పూర్తిగా మానేశారని, రోడ్డు పనులను తూతూ మంత్రంగా చేసి వదిలేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే తెల్లాపూర్ నుంచి కొల్లూర్ రోడ్డు మార్గంలో వాహనదారులతోపాటు వ్యాపారులు, వినియోగదారులు కూడా రోడ్డును చూసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే దుమ్ములో సాహవాసం చేయాల్సిందే. ద్విచక్ర వాహనదారుల అవస్థలు మరీ అధ్వానం. ఇప్పటికే పలుమార్లు ఆర్అండ్‌బీ, హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువైయ్యరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రేడియల్ రోడ్డు విషయంలో స్పందించి పూర్తిస్థాయిలో రోడ్డు పనులు చేసి రోడ్డు భద్రత నిబంధనలు ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

భూమి ఇప్పించండి..మహాప్రభో..

రాయికోడ్, ఫిబ్రవరి 15: మండలంలోని పిపడ్‌పల్లికి చెందిన శంకరమ్మ తన భర్తకు రావాల్సిన 15 గుంటల భూమిని ఇప్పించాలని శుక్రవారం రాయికోడ్ తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసింది. శంకరమ్మ అత్తయిన కొనింటి పారమ్మకు ఆరు గురు కొడుకులు అందులో ముగ్గురు చనిపోయారు. ఇటీవల అత్త పారమ్మ సైతం చనిపోయింది. రెవెన్యూ అధికారులు బతికున్న ముగ్గురు కొడుకుల పేర్లపై పౌతి చేశారు.ఈ విషయంపై ఇటీవల శంకరమ్మ తన భర్తకు రావాల్సిన వాట 15 గుంటలు ఇప్పించా లని తహసీల్దార్ శ్రీనివాస్‌కు కోరింది. ఈ విషయంపై తహసీల్దార్ మాట్లాడుతూ... ముగ్గురు కొడుకుల పేర్లపై స్లాట్ బుక్ కావడంతో పౌతి చేశామని చెప్పారు. పౌతి అనంతరం శంకరమ్మ కార్యాలయానికి రావడం తోపాటు ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. భూమికి సంబంధించిన అన్ని వివరాలను జిల్లా అధికారులకు పంపించామని, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సమగ్ర విచారణ చేసి శంకరమ్మకు న్యాయం చేస్తామని చెప్పారు.

రాయికోడ్ తహసీల్ కార్యాలయం ఎదుటనిరసన తెలుపుతున్న మహిళా రైతు

సొంత ఖర్చులతో బోరు వేయించిన బీఆర్ఎస్ నాయకుడు

కంది, ఫిబ్రవరి 15: ప్రజల సౌకర్యార్థం బీఆర్ఎస్ నాయకుడు సొంత ఖర్చులతో బోరు వేయించాడు. కందిలోని 4వ వార్డులో నీటి సమస్యను పరిష్కరించేందుకు ఆ వార్డు మాజీ మెంబర్ మహ్మద్ గౌస్ ముందుకొచ్చారు. శనివారం వార్డులో మత పెద్దలు, పార్టీ నాయకులతో ప్రత్యేక ప్రార్థనలు చేసి బోరు పనులు ప్రారంభించారు. నీరు పుష్కలంగా పడటంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి బోరు వేయించామన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలు తాగు, సాగు నీటి కష్టాలు చూడలేదని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

4వ వార్డులో బోరు వేయిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు మహ్మద్ గౌస్

మిస్టరీగా మారిన మిస్సింగ్ కేసు

నిజాంపేట్ వద్ద రహదారిపై ఆందోళన చేస్తున్న రాంచందర్ తండావాసులు(ఇన్‌సెట్‌లో) దశరథ్(ఫైల్)

నారాయణఖేడ్, ఫిబ్రవరి 15:యువకుడు కనిపించకుండా పోవడంతో పోలీసులు నమోదు చేసిన మిస్సింగ్ కేసు మిస్టరీగా మారింది. వివరాల్లోకి వెళితే..నిజాంపేట్ మండలం నాగధర్ రాంచందర్ తండాకు చెందిన అంగోత్ దశరథ్(26) సంగారెడ్డి సమీపంలోని గణేశ్ చక్కెర కర్మాగారంలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం దశరథ్ స్వగ్రామానికి వెళ్తున్నట్లు కర్మాగారం సిబ్బందితో చెప్పి బైక్‌పై బయలుదేరినప్పటికి ఇంటికి చేరలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. కానీ, శనివారం నిజాంపేట్ మండలం మేఘ్యానాయక్ తండాకు చెందిన గోపాల్, దశరథ్‌ను తానే హత్య చేశానని, మృతదేహాన్ని నిర్మానుష్య ప్రదేశంలో దహనం చేశానని పేర్కొంటూ నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు గోపాల్ సూచించిన ప్రదేశాల్లో మృతదేహం కోసం గాలించినప్పటికీ మృతదేహం గానీ దహనం చేసిన ఆనవాళ్లు గానీ కనిపించలేదు. దీంతో కేసును మరింత లోతుగా విచారించి పూర్వాపరాలు వెల్లడిస్తామని పోలీసులు వివరించారు.

రాంచందర్ తండావాసుల ధర్నా

దశరథ్ ఆచూకీ కనిపెట్టడంలో పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ రాంచందర్ తండావాసులు నిజాంపేట్ వద్ద రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. దశరథ్‌ను తానే హత్య చేశానని ఒక వ్యక్తి లొంగిపోయినప్పటికీ పోలీసులు విచారణను వేగవంతం చేయడం లేదని విమర్శించారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని విచారణ చేపట్టి దశరథ్ అచూకీ తేలుస్తామని భరోసా ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ జయంతిని శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పట్టణాలు, గ్రామాల్లో గిరిజనులు భారీ ర్యాలీలు నిర్వహించి, బోగ్‌బండార్ పూజలు చేశారు. సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించి గిరిజన నృత్యాలతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు. – న్యూస్‌నెట్‌వర్క్, సంగారెడ్డి, ఫిబ్రవరి 15

జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సేవలాల్ జయంతిని నిర్వహిస్తున్న బీఆరఎస్ నేతలు

నారాయణఖేడ్: సేవాలాల్ మహరాజ్, మాజీ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జోగిపేటలో సేవాలాల్ జయంతిలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

సంగారెడ్డిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

నారాయణఖేడ్ పట్టణంలోని 4వ వార్డు దుర్గామాత ఆలయంలో భోగ్‌భండార్ నిర్వహిస్తున్న గిరిజనులు

నారాయణఖేడ్‌లో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

వట్‌పల్లిలో సంత్ సేవాలాల్ పూజా కార్యక్రమంలో గిరిజన నాయకులు

కాసులహారం బహూకరణ

ఝరాసంగం, ఫిబ్రవరి 15: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో శనివారం రామచంద్రిపూర్‌కు చెందిన కృష్ణమూర్తి అమ్మవారికి మూడు తులాల బంగారు కాసుల హారాన్ని బహూకరించారు. కృష్ణమూర్తి దంపతులకు ఆలయ కార్యనిర్వహణ అధికారి శివరుద్రప్ప పూలమాల, శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి బసయ్య స్వామి, అర్చకులు దిలీప్ జ్యోషి, వీర్ సంగయ్య స్వామి, బద్రప్ప, నగేష్ ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడి ఘటనపై కమిషనర్ విచారణ

పటాన్‌చెరు, ఫిబ్రవరి 15: ముత్తంగిలో చిన్నారిని కుక్కలు కరిచిన ఘటనలో గాయపడ్డ బాలుడిని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి పరామర్శించి విచారణ నిర్వహించారు. శనివారం పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని న్యూటౌన్‌కాలనీకి మున్సిపల్ కమిషనర్ వచ్చారు. కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన ఖమ్రుద్దీన్ కుమారుడు ఉస్మాన్(5)ను పరిశీలించి దాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రంలోని మరో చిన్నారిపైన కుక్కలు దాడి చేశాయని ముత్తంగి మాజీ కోఆప్షన్ సభ్యుడు గడీల శ్రీధర్‌గౌడ్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఒకేరోజు ఇద్దరు పిల్లలపై కుక్కలు దాడి చేశాయని తెలిపారు. కాలనీలో కుక్కలు ఎక్కువ కావడంతో పిల్లలను బయటకు పంపే పరిస్థితి లేదన్నారు. స్పందించిన కమిషనర్ బాలుడికి మెరుగైన చికిత్స అందజేసేందుకు నగరంలోని నారాయణగూడ రెబీస్ ట్రీట్‌మెంట్ హాస్పిటల్‌కు రెఫర్ చేసి పంపుతున్నామన్నారు. కాలనీలోని కుక్కలకు వాక్సినేషన్ చేయిస్తామన్నారు. అవసరమైన కుక్కలకు సంతతి నివారణ ఆపరేషన్లు చేయిస్తామన్నారు. కాలనీలో పారిశుధ్య సమస్యను కూడా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇంత్యాజ్, భాస్కర్, మున్సిపల్ అధికారి నవోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు విరాళాలు

కోహీర్,/జిన్నారం, ఫిబ్రవరి15: చింతల్ ఘాట్‌లో నిర్మిస్తున్న దుర్గామాత ఆలయ నిర్మాణానికి మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, సజ్జాపూర్ గ్రామ వ్యాపారవేత్త ప్రసాద్‌రెడ్డి రూ.50వేల చొప్పున ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. జిన్నారంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి దాతల నుంచి విరాళాలు కొనసాగుతున్నాయి. తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రాములు గౌడ్ ఆలయ కమిటీ సభ్యులకు రూ.లక్ష ఇరవై వేల విరాళాన్ని అందజేశారు. ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు.

మాదారం పాఠశాలలో స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

జిన్నారం, ఫిబ్రవరి 15: మాదారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయ పాత్రలో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా, విద్యాధికారిగా, హెచ్ఎంగా వ్యవహరించి వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం హెచ్ఎంలు కవిత, భానుమతి మాట్లాడుతూ...విద్యార్థులను సమాజాన్ని సరైన మార్గంలో ముందుకు తీసుకెళ్లటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లీలావతి, రజిని, లక్ష్మి, పద్మజ, రాజేశ్, కృష్ణాగౌడ్, స్వరూపారాణి, సుధారాణి, సీఆర్పీ రజిత తదితరులు పాల్గొన్నారు.

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 15: మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల కారముంగిలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిపాలన అధికారిగా గాయత్రి, జిల్లా విద్యాశాఖ అధికారిగా మల్లేశ్వరి, మండల అధికారిగా అంబికా విధులు నిర్వహించారు. ఇతర విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రావు విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

జహీరాబాద్, ఫిబ్రోవరి 15: అనారోగ్యంతో వివిధ దవాఖానల్లో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. శనివారం జహీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో న్యాల్‌కల్ మండలంలోని మామిడ్గి గ్రామానికి చెందిన బీపాషాబీ హైదరాబాద్ లోని నిమ్స్‌లో చికిత్స పొందుతుండగా, మెరుగైన వైద్యంకోసం సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.5లక్షలు, జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన షేక్ గౌస్‌పాషాకు రూ.17,500 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులు నామరవికిరణ్, యాకూబ్, బండి మోహన్, అబ్దుల్లా, రాకేశ్, మాజిద్, నరేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మనస్సుకు ప్రశాంతత

రామచంద్రాపురం, ఫిబ్రవరి 15:ధ్యానంతో మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని కార్పొరేటర్ పుష్పానగేశ్ అన్నారు. ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలోని ఓంశాంతి కేంద్రంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని నిర్వహించిన శివజయంతి వేడుకల్లో కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఓంశాంతి జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓంశాంతి నిర్వాహకులు ధైవచింతనతోపాటు ధ్యానంపై ప్రజలకు అవగాహన పెంపొందిస్తున్నారని తెలిపారు.

ఎస్‌సీసీ సీ సర్టిఫికెట్ ప్రాక్టికల్స్

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 15: ఎన్‌సీసీ కెడెట్లకు శనివారం స్థానిక తారా ప్రభుత్వ కళాశాల మైదానంలో సీ సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్షలు జరిగాయి. నిజామాబాద్ రేంజ్ కమాండింగ్ అధికారి కల్నల్ విష్ణు పి నాయిర్ సమక్షంలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలల నుంచి 265 మంది కెడెట్లు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యారు. మాక్ డ్రిల్, మ్యాప్ రీడింగ్, వెపన్ హ్యాండ్లింగ్, డీఎన్టీ పరీక్షలు నిర్వహించారు. ఆదివారం వారందరికీ థియరీ పరీక్షలు నిర్వహించనున్నారు.

సీఆర్పీ కుటుంబాలను ఆదుకోవాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 15: మెదక్ జిల్లా చేగుంట మండలం మక్కరాజిపేట జడ్పీ హెచ్ఎస్ కాంప్లెక్స్ పరిధిలో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్పీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని న్యాల్‌కల్ మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్పీలు రమేశ్, శ్రీనివాస్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ రవి, సీఆర్పీలు రవీందర్, గోపాల్, విశ్వరాథ్, రాజు, జ్యోతి, లక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ మోహన్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అందోల్, ఫిబ్రవరి 15: అందోల్ తాలూకా నాలుగో తరగతి ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు. అందోల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా హరీశ్‌కుమార్, కార్యదర్శిగా రఫీ, ఉపాధ్యక్షుడిగా మల్లేశం. కోశాధికారిగా మధు, సంయుక్త కార్యదర్శిగా శ్ర